
సాక్షి చిత్తూరు

ఆదివారం । 5 । జనవరి । 2025



దేహదారుఢ్య పరీక్షలు

కానిస్టేబుల్ సెలక్షన్ కోసం చిత్తూరులో శనివారం మహిళలకు పకడ్బందీగా దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. - 8లో



నాడు ఆచరణ.. నేడు ఆర్భాటం

విద్యా క్యాలెండర్‌లను పాఠశాలలకు చేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. కేవలం ప్రచార ఆర్భాటానికే పరిమితమైంది. - 8లో



ఆలయంలో చోరీ

నగరి పట్టణ పరిధిలోని ఓరుగుంటాలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

నిరంతర విద్యుత్‌కు ముందస్తు చర్యలు



అన్నుపల్లె సబ్‌స్టేషన్ పరిశీలనలో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్,

చిత్తూరు కార్పొరేషన్ : రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని నిరంతరం విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ ఆదేశించారు. శనివారం రెడ్డిగుంట, అన్నుపల్లెలో కాలనీ సబ్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ ఎస్టీ సర్వీసుదారులను తీసుకురావాలని, వారికి ప్రస్తుతం అందిస్తున్న 200 విద్యుత్ యూనిట్లకు సంబంధించి సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి కుప్పంలో సీఎం పర్యటన

కుప్పం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కుప్పంలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ద్రవిడ విశ్వవిద్యాలయంలో స్వర్ణ కుప్పం విజన్- 2029 ప్రారంభించనున్నారు. అనంతరం అగరం కొత్తపల్లెలో డ్వాక్రా మహిళలతో సమావేశం కానున్నారు. 3.20 గంటలకు నడుమూరులో సోలార్ సిస్టమ్‌పై అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం చీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించనున్నారు. సాయంత్రం 5.20 గంటలకు ద్రవిడ వర్సిటీకి చేరుకుని టీడీపీ శ్రేణులతో నిర్వహించే సమావేశంలో పాల్గొననున్నారు. రాత్రి 8 గంటలకు కుప్పం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో బస చేయనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు టీడీపీ స్థానిక కార్యాలయానికి చేరుకుని వినతులు స్వీకరించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కంగుందిలో శ్యామన్న విగ్రహం ఆవిష్కరించనున్నారు. అనంతరం ఎన్‌టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ క్రమంలోనే కడపల్లె వద్ద నిర్మిస్తున్న తన నివాస పనులను పరిశీలించనున్నారు. తర్వాత ద్రవిడ వర్సిటీలో అకడమిక్‌బ్లాక్‌ను ప్రారంభించనున్నారు. రాత్రికి ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో బస చేసి, బుధవారం ఉదయం తిరుగుప్రయాణం కానున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను శనివారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మోహన్‌కుమార్ ఆవిష్కరించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వెల్లడించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు ఉమాపతి, రామచంద్రయ్య, రాజా పాల్గొన్నారు.

అపురూపం

SUNDAY SPECIAL

పుంగనూరు పొట్టి పశువుల ఖ్యాతి ఇనుమడిస్తోంది. కేవలం మూడడుగుల ఎత్తు మాత్రమే పెరిగే వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌లో రూ.లక్షల ధర పలుకుతోంది. ప్రపంచంలోనే అరుదైన జాతిని కొనుగోలు చేసేందుకు పోటీ అధికమవుతోంది. అదృష్ట చిహ్నంగా భావించే ఈ దూడలను పెంచుకునేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో ఔత్సాహిక రైతులు చిట్టి 'పొట్టి' నేస్తాలను ప్రత్యేకంగా ఉత్పత్తి చేయిస్తున్నారు. అపురూప దూడలను విక్రయించి లాభాలను ఆర్జిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఈ విశిష్ట జాతిని మరింతగా పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా పలమనేరులోని పశు పరిశోధన కేంద్రంలో పొట్టి దూడల సంరక్షణకు ఏర్పాట్లు చేశారు.



రూ.లక్షలు పలికే పుంగనూరు పొట్టి దూడలు



ఆత్మీయ నేస్తాలుగా పుంగనూరు పొట్టి దూడలు

- యజమానులపై ప్రేమ.. విశ్వాసం వీటి సొంతం
- రూ.లక్షల ధర పలుకుతున్న అరుదైన జాతి
- దేశవ్యాప్తంగా పెరిగిన డిమాండ్

పలమనేరు : పుంగనూరు పొట్టిరకం దూడల పేరు ఇప్పుడు రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. పుట్టిన సమయంలో ఈ దూడ కేవలం అడుగు ఎత్తు మాత్రమే ఉంటుంది. జీవితకాలంలో కేవలం మూడడుగులు మాత్రమే పెరుగుతుంది. తోక నేలను తాకేలా ఉండే ఈ రకం దూడలకు ప్రస్తుతం భలే డిమాండ్ వచ్చింది. ఫస్ట్ క్వాలిటీ రకం దూడలు రూ.2 నుంచి 4 లక్షలు పలుకుతున్నాయి. రెండో క్వాలిటీ దూడలు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రేటుకు అమ్ముడవుతున్నాయి. ఈ దూడలు ఇంట్లో ఇంటే ఆరోగ్యంతో పాటు అదృష్టం వరిస్తుందనే మాట వినిపిస్తోంది. ఈ క్రమంలో వీటిని కొనేందుకు వందలాదిమంది నిత్యం పశువుల సంతలు, రైతుల వద్దకు తిరుగుతున్నారు. సాధారణంగా ఇళ్లలో పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లుల జాబితాలో ఇప్పుడు పొట్టిదూడలు సైతం చేరిపోయాయి. వీటికి పేరు పెట్టి ఆ పేరుతో పిలిస్తే వెంటనే వచ్చేస్తాయి. చాలా శుభ్రంగా ఉంటాయి. 15 సెం.మీ నుంచి 50 సెం.మీ మాత్రమే ఎత్తు కలిగిన ఈ దూడలు ముద్దులొలుకుతుంటాయి. పొట్టి ఆవులు 85 సెం.మీ నుంచి 110 సెం.మీ మాత్రమే ఎత్తు పెరుగుతాయి. పలమనేరు ప్రాంతంలో కొందరు రైతులు వీటిని ఫామ్స్‌లో మేపి పొట్టి జాతిని ఉత్పత్తి చేయిస్తూ వాటిని రూ.లక్షలకు విక్రయిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పొట్టి రకం దూడల వ్యాపారం ఊపందుకోవడం విశేషం.

ఇందుకే అంత డిమాండ్

పుంగనూరు పశువులు ఆకర్షణీయంగా ఉంటాయి. ఇంటి యజమానులపై విశ్వాసం ప్రదర్శిస్తాయి. చూడముచ్చటగా ఉంటే పొట్టి దూడలు ఇంట్లో తిరుగుతుంటే చాలా మంచిదని జనం నమ్ముతారు. పొట్టి ఆవులు ఇచ్చే పాలలో రోగనిరోధకశక్తి అధికంగా ఉంటుంది. ఈ పాలను సేవిస్తే అనారోగ్యం దరిచేరదని విశ్వాసం. అలాగే కుటుంబంలో ఆర్థిక సమస్యలు తలెత్తవని ప్రగాఢ నమ్మకం. ఇంట్లో సంచరించే వీటి తోకలు నేలను తగిలితే ఎంతో సదరు యజమానులకు ఎంతో పుణ్యమని ప్రశస్తి. దీనికితోడు పొట్టి పశువులు పరిశుభ్రత పాటించడం విశేషం.

తక్కువ మేత.. అధిక పాల దిగుబడి

పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద 1953లో సంకర జాతి ఆవుల ఉత్పత్తి, పరిశోధన కేంద్రం ప్రారంభమైంది. ఇది 1995 నుంచి పుంగనూరు పొట్టి రకం పశువుల ఉత్పత్తి కేంద్రంగా మారింది. మేలైన పుంగనూరు ఎద్దుల వీర్యాన్ని పుంగనూరు రకం పొట్టి ఆవులను పెంచుతున్న రైతులకు అందిస్తోంది. వీటిని మరింత ఉత్పత్తి చేసేందుకు ఆర్‌కేవీవై కృషి చేస్తోంది. ప్రస్తుతం దేశంలో ఇలాంటి పశువులు 700 దాకా ఉండగా, ఇందులో 277 వరకు పలమనేరులోని పశు పరిశోధన కేంద్రంలోనే ఉన్నాయి. ఈ పశువులు తక్కువ మేతతో ఎక్కువ వెన్నశాతం కలిగిన పాల దిగుబడినిస్తాయి. వీటి మూత్రంలో సైతం ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి.

రైతులకు అందిస్తున్నాం



పలమనేరు పరిశోధన కేంద్రంతో పాటు ఏపీ ఎల్‌డీఏ ద్వారా కూడా ఈ జాతి వీర్యాన్ని రైతులు పొందవచ్చు. ఆవు ఎద కొచ్చిన తర్వాత స్థానిక వెటర్నరీ వైద్యుడి పర్యవేక్షణలో సెమన్ అందిస్తున్నాం. పుంగనూరు పొట్టిజాతిని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఈ వీర్యం అవసరమైన రైతులు క్యాటిల్‌ఫామ్‌లో కూడా తీసుకోవచ్చు.

– వేణు, శాస్త్రవేత్త, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, తిరుపతి

మూడేళ్లుగా పెంచుతున్నా



మూడేళ్లుగా పుంగనూరు రకం పొట్టి దూడలు పెంచుతున్నా. దేశవాళీ రకం పుంగనూరు ఆవుల ద్వారా దూడలను ఉత్పత్తి చేయిస్తున్నాం. ఈ ప్రాంతంలో చాలామంది పొట్టి దూడలు పెంచుతున్నారు. వీటికి భారీ డిమాండ్ ఉంది. ఆసక్తి ఉంటే రైతులకు ఇది ఎంతో లాభదాయకం.

– మణి, రైతు, మారేడుపల్లె, గంగవరం మండలం



● అయ్యో.. ఎస్ !



అధికార పార్టీకి చెందిన ఓ సాధారణ కార్యకర్త ముందు జిల్లాలో ప్రభుత్వ పాలన, శాంతి భద్రతలను పర్యవేక్షించే ఇద్దరు కీలక అధికారులు చేతులు కట్టుకుని నిలబడ్డ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు రోజుల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌కు సహాయకుడిగా ఉన్న ఓ టీడీపీ కార్యకర్త చలపతి ఏర్పాట్లను వివరిస్తుంటే కలెక్టర్, ఎస్పీ చేతులు కట్టుకుని ఇలా వింటున్నారు. దీనిపై నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. రాష్ట్రంలో రాజ్యాంగం అమలవుతున్న తీరుకు ఇది నిదర్శనమని వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

మెనూ తప్పిన భోజనం



ఐరాల : విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి



పీసీఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం

- జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పథకం
- రుచి లేని ఆహారంపై విద్యార్థుల విముఖత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం ప్రారంభమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకంపై విద్యార్థులు విముఖత వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం ఆహారం వడ్డించకపోవడంపై తల్లిదండ్రులు విమర్శలు గుప్పించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూటమి ఎమ్మెల్యేలు ఆర్భాటంగా మధ్యాహ్నభోజన పథకం ప్రారంభించారు. నిబంధనల ప్రకారం మొదటి రోజు అన్నం, సాంబార్, వెజిటబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, రాగి జావ విద్యార్థులకు పెట్టాల్సి ఉంది. అయితే నగరి, కుప్పం, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు రూరల్‌లో అన్నం, సాంబార్, రసంతోనే సరిపెట్టారు. ఇదిలా ఉంటే కొన్ని కళాశాలల్లో అన్నం ముద్దగా, రసం చప్పగా ఉండడంతో విద్యార్థులు తినేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. ఇంటర్ విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నభోజనం ఆరంభంలోనే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఎలా నిర్వహిస్తారో అని విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ అధికారులు నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమాల్లో కూటమి ఎమ్మెల్యేలకు రాచ మర్యాదలు చేసేందుకు ప్రాధాన్యమిచ్చి మెనూ పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఈ క్రమంలో పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు 'భోజనం'

ఐరాల:ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. శనివారం కాణిపాకం హైస్కూల్ ప్లస్‌లో పథకానికి డీఈఓ వరలక్ష్మి శ్రీకారం చుట్టారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరంగా మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఆదేశించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడుకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలోనే దాతల సాయంతో ఏర్పాటు చేసిన పాఠశాల గ్రంథాలయం సందర్శించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజన పథకాన్ని ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు ప్రారంభించారు.

దోపిడీకి గేటు

- రైతుల రక్తం పీల్చేస్తున్న కూటమి నేతలు
- తోపుడు బండి వ్యాపారుల నుంచి బలవంతపు వసూళ్లు
- ఎదురు తిరిగిన ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు
- ప్రజాప్రతినిధులు స్పందించాలంటూ డిమాండ్లు

● ఇది చిత్తూరు నగరంలో రోడ్డుపై కొబ్బరిబోండాలు విక్రయించుకుంటూ జీవితం నెట్టుకొస్తున్న ఓ పేదవాడు చెల్లించిన గేటు రుసుముకు సంబంధించిన రశీదు. డిసెంబర్‌లో రోజుకు రూ.20 వసూలు చేస్తే, ఈనెల 1వ తేదీ నుంచి రూ.50 గుంజుకుంటున్నారు. గుడిపాలకు చెందిన ఈ వ్యక్తి ఒక్కో కొబ్బరికాయను రూ.12లకు కొనుగోలు చేసి, దాన్ని రూ.20లకు అమ్ముకునేందుకు రోజంతా ఎండలో నిలబడాలి. బస్సు చార్జీలు, రెండు పూటల తిండి అన్నీ ఇందులోనే చూసుకోవాలి. సాయంత్రానికి జేబులో రూ.300 మిగిలాయి అనుకుంటే, గేటు పేరిట రూ.50 లాక్కుంటున్నారు.





● "చిత్తూరు పాత బస్టాండులో బస్సులు పార్కింగ్ చేసుకునేందుకు వసతి ఉందా..? ప్రయాణికులకు కనీస సౌకర్యాలు ఉన్నాయా..? గత పదేళ్లుగా ఒక్క రూపాయి కూడా గేటు కట్టలేదు. ఇప్పుడు వచ్చి ఏకంగా ఒక్కో బస్సుకు రోజుకు రూ.300 అడుగుతున్నారు. అంటే 72 బస్సులకు నెలకు రూ.6.48 లక్షలా..? ఇంత మొత్తం ఆదాయం వస్తుంటే, కార్పొరేషన్ వాళ్లు మూడు నెలలకు రూ.1.88 లక్షల చొప్పున ఎందుకు అప్పగించారు..? మేము పైసా కూడా గేటు రుసుము కట్టం. ముందు బస్టాండులో సౌకర్యాలు కల్పించాలి. గెజిట్‌లో గేటు ఫిక్స్ చేసేటప్పుడు మా అభ్యంతరాలు తీసుకోవాలి. మేము కూడా రూలింగ్(టీడీపీ) పార్టీలో కీలక పదవుల్లో ఉన్నాం.."

– శనివారం నగర పాలక సంస్థ కమిషనర్‌తో ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల భేటీలోని సారాంశం



చిత్తూరు పొన్నియమ్మ గుడి వీధిలో రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న సామాన్యులు

చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కొలువై ఉంటారు. అయితే నగరంలోని అక్రమాలను ఒక్కరూ పట్టించుకోవడం లేదు. కూటమి నేతలు 'గేటు' పేరుతో సామాన్యుడిని యథేచ్ఛగా దోచుకుంటున్నా.. నడిరోడ్డుపై దౌర్జన్యాలకు దిగుతున్నా ప్రశ్నించేవారే కనిపించడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు వచ్చిన రైతుల రక్తాన్ని పీల్చేస్తున్నా.. స్పందించే నాథుడే కరువయ్యాడు. ప్రధానంగా జిల్లాలోని 20 మండలాలతోపాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన రైతులు కూరగాయలను చిత్తూరులోని హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఈ రైతులతోపాటు నగరంలోని రోడ్లపై వ్యాపారాలు చేసుకునేవాళ్ల నుంచి కార్పొరేషన్ గేటు పేరిట కొద్ది మొత్తంలో రుసుము వసూలు చేయొచ్చని గెజిట్‌లో రూపొందించారు. అయితే ఎవరు గేటు చెల్లించాలి..? ఎంత చెల్లించాలి..? ఎవరికి మినహాయింపు ఉంది..? అనే విషయాలు కార్పొరేషన్ యంత్రాంగం ఎక్కడా ప్రకటించలేదు. కనీసం బహిరంగ ప్రదేశాల్లో బోర్డు సైతం ఏర్పాటు చేయలేదు. పైగా అధికారుల వద్ద ఉన్న గెజిట్‌లో రుసుముల వసూళ్ల మొత్తం తప్పులతో నిండిపోయింది. గేటు వసూలులో వచ్చిన విభేదాలే గతంలో అప్పటి మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ హత్యకు కారణమనే విషయం చిత్తూరులో అందరికీ తెలిసిన సత్యం. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తన సొంత డబ్బులను కార్పొరేషన్‌కు చెల్లించేవారు. దీంతో ప్రజలపై ఒక్క రూపాయి కూడా గేటు భారం పడేది కాదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్కెట్ గేటును తమ కార్యకర్తల చేతుల్లో పెట్టింది. దీంతో వారు ఇష్టారాజ్యంగా సామాన్యులను దోచుకుంటున్నారు. ఈ వ్యవహారం మరికొందరిని బలి కోరకముందే ప్రజా ప్రతినిధులు మేల్కొని, మార్కెట్ గేటు వసూలుపై నియంత్రణ పెట్టాల్సిన అవసరముంది. చిత్తూరు నగర అభివృద్ధికి, ప్రజల ప్రశాంత జీవనానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని పదే పదే చెబుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్ సైతం దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ప్రణవ్



చిత్తూరు కలెక్టరేట్ : స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు చిత్తూరులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి ప్రణవ్ గోవర్ధన్ ఎంపికయ్యాడు. గత ఏడాది డిసెంబర్ 33, 31 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీల్లో ప్రణవ్ ప్రతిభ కనబరిచాడు. త్వరలో బీహార్‌లోని పాట్నాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. శనివారం ఈ మేరకు విద్యార్థిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, ఖోఖో సంఘం కార్యదర్శి శరత్‌బాబు అభినందించారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ


దుండగులు పగలగొట్టిన హుండీ

నగరి : స్థానిక సాళ్వపట్టెడలోని ఓరుగుంటాలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం శుభ్రం చేసేందుకు వచ్చిన మహిళ ఈ విషయం గుర్తించి ధర్మకర్త చిరంజీవిరెడ్డికి సమాచారం అందించింది. ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ.30 వేల వరకు నగదు ఉంటుందని, అలాగే 8 గ్రాముల బంగారు తాళిబొట్టు, వెండి తట్ట చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

టీడీపీ నేతల వేధింపులపై ఆవేదన


రమణప్రకాష్, ఎంపీడీఓ, విజయపురం మండలం

విజయపురం : మండలంలోని కొందరు టీడీపీ నేతలు తీవ్రంగా వేధిస్తున్నారని ఎంపీడీఓ రమణప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విధి నిర్వహణకు సైతం టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారని, దౌర్జన్యంగా లెటర్లు రాయించుకుని సంతకాలు పెట్టించుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల శ్రీహరిపురంలోని సచివాలయం తనిఖీ చేశామని, సాయంత్రం 4.30 గంటలకే సిబ్బంది లేరని వెల్లడించారు. దీంతో సచివాలయంలోని విలువైన సామగ్రి చోరీకి గురి కాకుండా తాళం వేశామన్నారు. దీంతో కొందరు సచివాలయ సిబ్బంది కక్షగట్టి టీడీపీ నేతలతో కలిసి కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. ఎవరు ఎన్ని రకాలుగా వేధించినా భయపడే ప్రసక్తే లేదని, నిజాయితీగా పనిచేసుకుంటూ వెళతానని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుల ఒత్తిడి తలొగ్గే ప్రసక్తే లేదని తెలిపారు. అయితే జిల్లా అధికారులు తనకు అండగా నిలవాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,550 మంది స్వామివారిని దర్శించుకోగా 28,853 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నాడు ఆచరణ.. నేడు ఆర్భాటం

పలు పాఠశాలలకు అందని విద్యా క్యాలెండర్

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్కూళ్ల ఆరంభంలోనే పంపిణీ
- కూటమి సర్కారు తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయులు


పాఠశాలలో విద్యా క్యాలెండర్ (ఫైల్)

పాఠశాల నిర్వహణకు సంబంధించి సమగ్ర సమాచారంతో అకడమిక్ క్యాలెండర్ రూపొందిస్తారు. సబ్జెక్టుల వారీగా తరగతుల వివరాలు అందులో పొందుపరుస్తారు. అలాగే సెలవుల సమాచారం పేర్కొంటారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే క్యాలెండర్‌ను స్కూళ్లకు అందజేస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ప్రక్రియ పకడ్బందీగా సాగేది. పాఠశాల ఆరంభంలోనే విద్యా క్యాలెండర్ వచ్చేసేది. పిల్లలు.. ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా సమాచారం అందుబాటులో ఉండేది. అయితే కూటమి సర్కారు మాత్రం ఈ విషయంలో తూతూమంత్రంగా వ్యవహరిస్తోంది. గత ఏడాది జూలైలో అన్ని స్కూళ్లకు క్యాలెండర్ పంపుతున్నట్లు మంత్రి లోకేష్ ఆర్భాటంగా ప్రకటించారు. మరో మూడు నెలల్లో విద్యా సంవత్సరం ముగుస్తున్నా.. ఇప్పటికీ చాలా పాఠశాలలకు క్యాలెండర్ అందకపోవడంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : గత ఏడాది జూలై 29వ తేదీన విజయవాడలో మంత్రి నారా లోకేష్ విద్యా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వాటిని రాజకీయాలకు అతీతంగా ముద్రించామంటూ గొప్పలు చెప్పుకున్నారు. అయితే విద్యాసంవత్సరం ముగుస్తున్నా ఇంత వరకు జిల్లాలోని సగానికి పైగా పాఠశాలలకు క్యాలెండర్ చేరలేదు. దీంతో ముద్రించి క్యాలెండర్లు ఏమయ్యాయనే ప్రశ్నలు ఉపాధ్యాయుల్లో తలెత్తుతున్నాయి.

బడి నిర్వహణకు అవసరం

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు విద్యా క్యాలెండర్ ఎంతో ముఖ్యం. అయితే కూటమి ప్రభుత్వం ఇంత వరకు పూర్తి స్థాయిలో వాటిని పంపిణీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. క్యాలెండర్ల కోసం నిత్యం పలువురు హెచ్‌ఎంలు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో అధికారులను సంప్రదిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఫలితం కనిపించడం లేదు.

వివరాలు ఇలా..

విద్యాక్యాలెండర్‌లో సబ్జెక్టుల వెయిటేజి ప్రకారం పీరియడ్ల వివరాలు ఉంటాయి. వివిధ సబ్జెక్టుల వెయిటేజీ ప్రకారం తరగతులను పేర్కొంటారు. హైస్కూళ్లలో అన్ని సబ్జెక్టులకు వెయిటేజీని ప్రకటిస్తూ వారానికి బోధించాల్సిన తరగతులను తెలియజేస్తారు.

ముగింపు దశలోనూ..

2024–25వ విద్యాసంవత్సరం మరో మూడు నెలల్లో ముగియనుంది. అయితే ఇంత వరకు విద్యా క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో సరఫరా చేయలేదు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,436 పాఠశాలలకు గాను, 1,218 బడులకు పైగా క్యాలెండర్లు రాలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో క్యాలెండర్‌కు కేటాయించిన నిధులు పక్కదారి పట్టాయేమో అని పలువురు అనుమానిస్తున్నారు. విద్యా క్యాలెండర్ లేకపోవడంతో అభ్యసనా కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. పాఠశాలల నిర్వహణకు పక్కా ప్రణాళిక రూపొందించుకోలేక పోతున్నారు. ప్రధానంగా గంగాధరనెల్లూరు మండలం, కార్వేటినగరం, పాలసముద్రం, నగరితోపాటు పలు మండలాలకు ఇంత వరకు అకడమిక్ క్యాలెండర్లు రాలేదు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి నేరుగా ఎంఈఓలకు పంపించామని అధికారులు మాత్రం చేతులు దులిపేసుకుంటున్నారు.

జిల్లా సమాచారం

కేటగిరి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,902	64,519
ప్రాథమికోన్నత	204	45,800
ఉన్నత	330	30,898
మొత్తం	1,436	1,41,217

సెలవులెప్పుడో తెలుసుకోలేని దుస్థితి

పాఠశాలల నిర్వహణకు సంబంధించి విద్యా క్యాలెండర్‌లో సమగ్ర వివరాలుంటాయి. అయితే ఈ విద్యాసంవత్సరంలో ఆ క్యాలెండర్ సరఫరా చేయకపోవడంతో సెలవులు ఎప్పుడెప్పుడు ఉంటాయనే విషయం తెలుసుకోలేని దుస్థితిలో ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా పాఠశాలల ప్రారంభంలోనే విద్యా క్యాలెండర్‌లను బడులకు సరఫరా చేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు ముగుస్తున్నా ఇప్పటి వరకు క్యాలెండర్లు పంపిణీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇకపై పంపించినా ఎలాంటి ఉపయోగం ఉండదని అయ్యోర్లు వాపోతున్నారు.

ఎంఈఓలకే వస్తాయి

"అకడమిక్ క్యాలెండర్‌లు నేరుగా విజయవాడ నుంచి ఎంఈఓలకు చేరుతాయి. అక్కడ నుంచి ఆయా మండలాల్లోని పాఠశాలలకు సరఫరా చేస్తారు. జిల్లాలో అన్ని పాఠశాలలకు క్యాలెండర్‌లు చేరిపోయి ఉంటాయి. ఎవరికైనా అందకపోతే ఎంఈఓలను సంప్రదించాలి."
– వెంకటేశ్వరరావు, ఏడీ, డీఈఓ కార్యాలయం, చిత్తూరు

కొండపై కొత్త తళుకులు



తిరుమల: కొండపై ప్రముఖ సినీ నటి జాన్వీకపూర్ తళుక్కుమన్నారు. శ్రీవారి దర్శనార్థం ఆమె శనివారం సాయంత్రం కాలినడకన తిరుమల చేరుకున్నారు. అనంతరం ఉదయం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు, కరచాలనం అందించేందుకు పలువురు భక్తులు పోటీ పడ్డారు.

వేతన వెతలు!

చిత్తూరు కలెక్టరేట్ : ఏమి బాలరాజు ఒకటో తేదీనే జీతాలు వస్తాయని కూటమి పార్టీలకు ఎగిరెగిరి ఓట్లు గుద్దితిమి...అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మారిపోయెనే. కొత్త సంవత్సరం ప్రారంభంలో జీతాల కోసం ఎదురు చూపులు తప్పడం లేదే.. అంటూ ఉపాధ్యాయులు తమ సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో ప్రభుత్వ వైఖరిపై ఛలోక్తులు విసురుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులపై పక్షపాత ధోరణి పాటిస్తోందని టీచర్లు వాపోతున్నారు. నెల తొలివారంలోకి వస్తున్నా ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటో తేదీనే జీతాలు ఇస్తామన్న చంద్రబాబు, ఇప్పుడు ఎందుకు ఆ మాట అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల్లో టీచర్లకు మినహాయించి మిగిలిన అన్ని శాఖల ఉద్యోగులకు జీతాలు మంజూరు చేశారు. అయితే టీచర్లకు మాత్రం ఇప్పటి వరకు వేతనాలు జమచేయలేదు. దీంతో జిల్లాలోని 12,919 మంది ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

దళితులపై దాడులను సహించం


మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


పోలీస్ స్టేషన్ వద్ద సీపీఎం, దళిత సంఘం నేతలు

- తడుకుపేట ఘటన దారుణం
- ఎస్పీకి ఫోన్ చేసినా స్పందించలేదు
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: దళితులపై దాడులను సహించమని, టీడీపీ హయాంలోనే అగ్రకులాలు రెచ్చిపోతాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ తడుకు పేటలో దళితులపై జరిగిన దాడులు గతంలో పాదిరికుప్పం, కారంచేడులో జరిగిన ఘటనలను తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 1983లో టీడీపీ మూకలు పేట్రేగిపోయి పాదిరికుప్పం దళితవాడను కాల్చేశారన్నారు. అలాగే కారంచేడులో దళితులను ఊచకోత కోశారని వెల్లడించారు. అగ్రకులాల కోసం టీడీపీ కొత్త రాజ్యాంగం రాసుకుందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ దళితులకు కనీసం చెప్పులు వేసుకునే స్వేచ్ఛ రాలేదా అని ప్రశ్నించారు. ఎస్పీకి ఫోన్ చేసి తడుకు పేటలో దళితులపై దాడులు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు. లా అండ్ ఆర్డర్‌ను అదుపు చేయాల్సిన బాధ్యత ఎస్పీకి లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, ఇలాంటి పోలీసులు ఉన్నంత వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తడుకు పేట దళితులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చర్యలకు దళిత సంఘాల డిమాండ్

నగరి : మండలంలోని తడుకుపేటలో దళితులపై జరిగిన దాడులపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. శనివారం తడుకు దళితవాడకు వెళ్లి బాధితులను పరామర్శించాయి. ఈ క్రమంలోనే సీపీఎం నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దళితులకు గ్రామ బహిష్కారం విధించే అధికారం కూటమి నేతలు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అలాగే చట్ట విరుద్ధంగా ఆంక్షలు విధించడం ఏంటని మండిపడ్డారు. రాజకీయాలకు అతీతంగా దళిత మహిళలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అదుపులోనే శాంతిభద్రతలు

తడుకు గ్రామం, దళితవాడలో పరిస్థితి అదుపులోకి వచ్చిందని, శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని సీఐ మహేశ్వర్ తెలిపారు. ఈ ప్రాంతంలో 4 పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటుచేశామన్నారు. ఎస్పీ, డీఎస్పీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ ఘటనలో రెండు వర్గాల పైనా కేసులు నమోదుచేశామని తెలిపారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన

తిరుపతి లీగల్: రాయలసీమ జిల్లాలకు చెందిన 25 మంది న్యాయమూర్తులకు ఈనెల ఆరో తేదీ నుంచి మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ తెలిపారు. రాష్ట్ర న్యాయసేవ సంస్థ, ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ, తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ సంయుక్తంగా రాయలసీమ జిల్లాలకు చెందిన 25 మంది న్యాయమూర్తులకు తిరుపతి శ్వేత భవనంలో ఈనెల ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు.

ఎర్రచందనం పట్టివేత


దుంగలు, నిందితుడితో అటవీశాఖ అధికారులు

పులిచెర్ల(కల్లూరు) : పులిచెర్ల వద్ద శనివారం వేకువజామున కారులో అక్రమంగా తరలిస్తున్న 11 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ముగ్గురు పరారవగా, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ సుమారు రూ.16లక్షలు ఉంటాయని పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురు ప్రభాకర్ తెలిపారు. నిందితుడిని తమిళనాడుకు చెందిన సతీష్(22)గా గుర్తించామన్నారు. దాడుల్లో ఎఫ్‌ఆర్‌ఓ చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఓ ప్రతాప్ పాల్గొన్నారు.

కలికిరి కొండపై ట్రెక్కింగ్


కొండపై అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజలు

పెనుమూరు(కార్వేటినగరం) : అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం కలికిరి కొండపై ట్రెక్కింగ్ నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారి భరణి, రేంజ్ అధికారి థామస్ నేతృత్వంలో స్థానికులు పాల్గొన్నారు. డీఎఫ్‌ఓ భరణి మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించేందుకే ట్రెక్కింగ్ చేపట్టినట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని పర్యాటక కేంద్రాల్లో ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

దేహదారుఢ్య పరీక్షలు


రన్నింగ్ పరీక్షలో మహిళా అభ్యర్థులు

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి చిత్తూరు నగరంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు శనివారం కూడా కొనసాగాయి. అలాగే 496 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 274 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులో మొత్తం 80 మంది మహిళలు అర్హత సాధించారు. మొత్తం ప్రక్రియను ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు.